సాక్షి కర్నూలు

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: దసరా సెలవులు రావడంతో శనివారం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తుంగభద్ర నదీతీరం, కారిడార్‌లు కిక్కిరిసి కనిపించాయి.



24 వరకు మార్కెట్‌కు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): దసరా పండుగ సందర్భంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నెల 22 నుంచి 24 వరకు సెలవు ప్రకటించారు. ఈ రోజుల్లో క్రయవిక్రయాలు జరగవు.



తొమ్మిది మందికి పదోన్నతి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలో తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా బొజ్జమ్మ



కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కర్నూలు జిల్లా అధ్యక్షురాలిగా కప్పట్రాళ్ల సుశీలమ్మ (బొజ్జమ్మ)ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెను ఈ పదవిలో నియమించినట్లు ప్రకటించింది.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యునిగా హఫీజ్ ఖాన్



కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యునిగా కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు మరోసారి అవకాశం లభించింది. శాసన సభ్యుల కోటాలో ఆయనను నియమించగా ఆదోనికి చెందిన న్యాయవాది జె.నాసిర్ బాషాను నామినేట్ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 47 శనివారం రాత్రి విడుదల చేసింది.

డీటీడబ్ల్యూఓగా కేవీ శివప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న శివప్రసాద్

కర్నూలు(అర్బన్): జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా కేవీ శివప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గ్రూప్-1 అధికారిణి తేజశ్వినికి పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆమె 8 నెలల పాటు శిక్షణకు వెళ్లిపోవడంతో నంద్యాల డీటీడబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న కేవీ శివప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ డైరెక్టర్ జె.వి. మురళి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలసి ఆమె ఆదేశాల మేరకు శివప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

బడిమానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి

ఆదోని సెంట్రల్: బడిమానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రంగారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎంఎం కాలనీ, 8వ వార్డు, మహర్షి, వాల్మీకి నగర్ కాలనీలో, అలాగే మండలంలోని హనావాళ్ గ్రామంలో పర్యటించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి, పాఠశాలకు పంపించాలని సూచించారు. ఎనిమిది మంది పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించడానికి ఒప్పించారు. డీఈఓ వెంట ఎంఈఓలు శివరాములు, శ్రీనివాసులు, సీఆర్‌పీలు ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 35 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి ప్రతిభా దేవి, సభ్యులు

కర్నూలు(లీగల్): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో 35 రోడ్డు ప్రమాద కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాసకుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లీశ్వరి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభా దేవి, సభ్యులు కుమార్, నిర్మల పాల్గొని 16 కేసులు పరిష్కారం చేశారు. బీమా కంపెనీలు రూ.1.70 కోట్లు చెల్లించేందుకు అంగీకరించాయి. ఆదోనిలో రెండు కేసులు, నంద్యాలలో 15 కేసులు, ఆళ్లగడ్డలో రెండు కేసులు మొత్తం 32 కేసులు పరిష్కారం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రులు అంజాద్‌బాషా, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి

బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

99 శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం

- అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే మేలు
- చేసిన మంచిని వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర
- ప్రజల్లో సానుకూలత ఉంది.. టీడీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడమే ధ్యేయం
- బస్సు యాత్ర జయప్రదంపై నంద్యాలలో సన్నాహక సమావేశం
- హాజరైన మంత్రులు పెద్దిరెడ్డి, అంజాద్ బాషా, బుగ్గన, గుమ్మనూరు
- పాల్గొన్న ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు

కర్నూలు(రాజ్‌విహార్): బలహీన వర్గాల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టే 'సామాజిక సాధికార బస్సు యాత్ర' జయప్రదం చేసేందుకు శనివారం నంద్యాలలోని ఉదయానంద రెసిడెన్సీలో వైఎస్‌ఆర్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్ బాషా, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, 14 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఉన్నారని, వారి వెనుకబాటును గుర్తించి మేలు ఏ ప్రభుత్వం మేలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం వారిని ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 99 శాతం హామీలు అమలు చేయడంతో పాటు అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే మేలు చేకూర్చారన్నారు. ముఖ్యంగా రాజకీయ, విద్య, వైద్యం, సామాజిక, ఆర్థికంగా ప్రత్యేక గుర్తింపు కల్పించారన్నారు. స్థానిక సంస్థలతో పాటు ఇతర రంగాల్లో 50–60శాతం అణగారిన, బడుగు బలహీన వర్గాలకే పెద్దపీట వేశారన్నారు. ఇంతటి మేలును వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, దీనిని కలసికట్టుగా జయప్రదం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఉందని, అనుకూల మీడియాను అడ్డు పెట్టుకొని టీడీపీ సాగిస్తున్న విషప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు.





సమావేశానికి హాజరైన ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ 76 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. బీసీ డిక్లరేషన్‌తో సరికొత్త చరిత్రకు నాంది పలికారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒక మైనారిటీకి డిప్యూటీ సీఎం పదవి కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. తనతో పాటు అట్టడుగున ఉన్న ఎంతో మంది ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు నామినెట్ పదవులను పొందారని గుర్తు చేశారు.
- రీజినల్ కో ఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ అణగారిన, దళిత వర్గాల బతుకుల్లో వెలుగులు నింపిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. రాజకీయ, సామాజిక, విద్య, ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు కల్పించడంతో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశారన్నారు. ఇందులో అధిక శాతం ఆయా సామాజిక వర్గాలకే మేలు జరిగిందని, ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పారదర్శక పాలనతో సీఎం వైఎస్ జగన్ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మంచి చేస్తుంటే.. ఓర్వలేని తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రభుత్వంపై విషం చిమ్మే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీలా మనకు మీడియా లేకపోయినా ప్రజల మద్దతు ఉందని, అయితే వారికి చేసిన మేలును మరోసారి తెలిపేందుకే జనంలోకి వెళ్తున్నట్లు చెప్పారు.
- మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ బీసీల ప్రభుత్వం అని చెప్పుకునే పార్టీలు కేవలం ఎన్నికల ముందు మాత్రమే తాయిలాలు ఇచ్చి ఓట్లు వేయించుకున్నారన్నారు. తాము రాజకీయంగా ఎదిగేందుకు పావుల్లా వాడుకున్నారే కానీ అధికారంలోకి వచ్చాక చేసిందేమీ లేదని చెప్పారు. ఒక బీసీగా తనలాంటి వారు మంత్రిగా ఉన్నారంటే అది కేవలం సీఎం జగన్ ఘనతే అన్నారు. వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రభుత్వ మేలును బస్సు యాత్ర ద్వారా చెప్పాలన్నారు.
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఒకప్పుడు ప్రభుత్వ పథకాల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ కారణంగానే అణగారిని వర్గాలు అన్నివిధాలా వెనుకబడ్డారన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు.
- రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సామాజిక బస్సు యాత్రను పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని జయప్రదం చేయాలన్నారు. ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలో యాత్ర జయప్రదంపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.
- నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాలంటే సీఎం జగన్‌కు ఎంతో ఇష్టమన్నారు. అందుకే ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చారని, వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అధికంగా లబ్ధి చేకూర్చారన్నారు. నేరుగా వారి ఖాతాలోకి నగదు జమ చేస్తుండడంతో మంచి జరిగిందనే విషయాలు యాత్రలో చెప్పాలన్నారు.
- కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలని ప్రతి రోజూ ఆలోచించే ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. కేవలం నాలుగున్నరేళ్లలో అనేక పథకాల ద్వారా మంచి చేశారని, మరోసారి గెలిస్తే పేదల కష్టాలు తొలగిస్తారన్నారు.
- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. మాటలతో చెప్పడం కాకుండా చేసి చూపిన ఘనత ఆయనదేనన్నారు.
- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా నా వాళ్లు అని చెప్పుకునే మంచి మనస్సు సీఎం జగన్‌కే ఉందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు యాత్రతో ప్రజల్లోకి వెళ్తామన్నారు.
- ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ సీఎం జగన్ తెచ్చిన సంక్షేమ పథకాలతో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఈ విషయాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.
- సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, శిల్పాచక్రపాణి రెడ్డి, కంగాటి శ్రీదేవి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సాగునీటి ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, మైనార్టీ ప్రభుత్వ సలహాదారులు హబీబుల్లా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఇరిగేషన్ బోర్డు చైర్మన్ కర్రా గిరిజా, కుడా చైర్మన్ కొట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు భరత్‌కుమర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలం: దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం కాళరాత్రి అలంకారంలో ఉన్న అమ్మవారికి, గజవాహనంపై ఆదిదంపతులకు ఆలయ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో ఏడు పత్తి కొనుగోలు కేంద్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి రైతుకు మద్దతు ధర కల్పించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదోనిలోని జయంత్ కాటన్ ఇండస్ట్రీస్, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, గూడూరు మండలం పెంచికలపాడులోని మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, ఎమ్మిగనూరులోని మాధవ్ కాటన్, శివ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్, మురారీ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ప్యాక్టరీ, రాఘవేంద్ర అగ్రో ఇండస్ట్రీస్‌ల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ నెల 25 నుంచి క్వింటా పొడువు పింజ పత్తి రూ.7,020, పొట్టి పింజ పత్తి రూ.6,620 ప్రకారం కొనుగోలు చేయనున్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల స్థూపం ముందు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

- జిల్లా కలెక్టర్ సృజన



పోలీసు అమరవీరుల పుస్తకాన్ని తీసుకువస్తున్న సాయుధ బలగాలు

కర్నూలు: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని, వారు చేసిన త్యాగాలు సేవలు మరువలేనివని కలెక్టర్ సృజన అన్నారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్మృతి పరేడ్ నిర్వహించారు. కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ స్మృతి పరేడ్‌కు హాజరై పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించుకుంటూ నివాళులర్పిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్-చైనా సరిహద్దు లఢఖ్‌లోని హాట్‌స్ప్రింగ్ వద్ద పోలీసు పెట్రోలింగ్ పహారాలో ఉన్నటువంటి పది సీఆర్‌పీఎఫ్ జవాన్లపై శత్రువులు దాడి చేయగా ధైర్య సాహసాలతో వారిపై ప్రతిదాడి చేస్తూ పోరాడి వీరమరణం పొందారన్నారు. వారు త్యాగాలను గుర్తించి, గౌరవించి దేశ వ్యాప్తంగా అమరవీరుల దినోత్సవం ప్రతి ఏటా జరుపుకుంటూ శ్రద్ధాంజలి నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసుల పేర్లను ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా చదివి వినిపించారు. అందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తూ నివాళులర్పించి రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, హోం గార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సర్కార్, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, విజయశేఖర్, నాగభూషణం, శ్రీనివాసులు, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి పాల్గొన్నారు.

సహాయార్థులకు మెరుగైన వైద్యం

- ఉపాధి కల్పన కోసం విన్నవించుకున్న వినతులను పరిశీలిస్తాం
- సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మిగనూరులో వచ్చిన వినతులపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన



హాజరైన వివిధ శాఖల అధికారులు

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించుకున్న సహాయార్థులకు తప్పనిసరిగా మెరుగైన వైద్యం సహాయం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. అదే సమయంలో ఉపాధి కల్పన కోసం వచ్చిన వినతులపై కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు. గురువారం ఎమ్మిగనూరు పర్యటనలో సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఇచ్చిన వినతులపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బాధితులకు వైద్య చికిత్సలు, ఉపాధి కల్పన చేయాల్సి ఉందన్నారు. సీఎంకు వినతి పత్రాలు ఇచ్చిన వారిలో ఇప్పటికే 12 మందికి తక్షణ సాయంగా ఒక్కొకకరికీ రూ. లక్ష ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన అర్జీలతో ఎక్కువ శాతం అనారోగ్య సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని, సీఎం ఆదేశాల మేకరు బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు బాధితులకు తీసుకున్న చికిత్సలు, వైద్య పరీక్షలు పరిశీలించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించే అవకాశం ఉంటే ఆరోగ్య మిత్రల ద్వారా ఆసుపత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్య సహాయం చేయించాలని వైద్యులను ఆదేశించారు. లేని పక్షంలో ఎక్కడ వైద్యం అందుబాటులో ఉందో తదితర వివరాలను తెలపాలన్నారు. జీవనోపాధి కోసం అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సలీంబాషా, నాగశివలీలలను ఆదేశించారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను తీసుకుని రిజిష్టర్ చేసి వారి విద్యార్హత మేరకు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక వేళ తమ పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారులకు నివేదించి సదరు సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలిన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకరరెడ్డి, ఉపాధి కల్పన అధికారి దీప్తి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రైజ్ ఫాతిమా, తహశీల్దార్లు వేణుగోపాల్ శర్మ, వెంకటేష్ నాయక్, వివిధ విభాగల వైద్యులు పాల్గొన్నారు.

ఆఫర్ల సీజన్‌ వచ్చేసింది!

- దసరా పండుగ సందర్భంగా పుంజుకున్న వ్యాపారాలు
- కొనుగోళ్లతో కిక్కిరిస్తున్న దుకాణాలు



కర్నూలులో ఎలక్ట్రానిక్‌ వస్తువులను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



దుకాణంలో సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తూ..



వినియోగదారులతో కిటకిటలాడుతున్న బంగారు దుకాణం

కర్నూలు కల్చరల్‌: దసరా శరన్నవరాత్రి వేడుకలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. పండుగ సందర్భంగా ఎక్కువ మంది కొత్త వాహనాలు, దుస్తులు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్‌ వస్తువులు, మెబైల్స్‌ లాంటివి కొనుగోలు చేస్తుంటారు. వీరిని దృష్టిలో పెట్టుకొని వ్యాపారులు ఇప్పటికే పలు ఆఫర్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొనుగోళ్లతో దుకాణ సముదాయాలు, దుకాణాలు కస్టమర్లతో కిక్కిరిసి పోతున్నాయి. బహుళ, ప్రముఖ కంపెనీలు రూ.10 వేలకు పైగా కొనుగోళ్లకు భారీ బహుమతులను అందిస్తున్నాయి. ఇటీవల పలు జాతీయ స్థాయి బంగారు దుకాణాలు కర్నూలు, నంద్యాలతోపాటు ముఖ్యపట్టణాల్లో వెలిశాయి. మేకింగ్‌ ఛార్జీల్లో రాయితీల లాంటి ఆఫర్లతో బంగారు దుకాణాలు సైతం కొనుగోళ్లతో సందడిగా మారాయి. సెల్‌ఫోన్‌లు, టీవీ, ఫ్రిజ్‌, కార్లు, ద్విచక్ర వాహనాల దుకాణాలు కొనుగోళ్లతో కిటకిట లాడుతున్నాయి. పలు రకాల ఫీచర్స్‌, కొత్త మోడల్స్‌ మార్కెట్‌లో అందుబాటులో ఉండటంతో కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో షోరూంలు నిండిపోతున్నాయి.

➤ సోనోవిజన్‌ వారు ప్రతి కొనుగోలుపై దసరా స్క్రాచ్‌ కార్డ్‌ స్కీమ్‌, డిస్కౌంట్‌ సేల్‌ సౌకర్యం కలిస్తున్నారు. ప్రతి రూ.2వేల కొనుగోలుతో రూ.100 నుంచి 1,00,000 వరకు స్క్రాచ్‌ కార్డ్‌తో పాటు తక్షణ నగదు బహుమతులను అందిస్తున్నారు.

➤ రిలయన్స్‌ డిజిటల్స్‌ వారు ఎలక్ట్రానిక్స్‌ ఫెస్టివల్‌ ఆఫర్లు ప్రకటించారు. రూ.10.000 వరకు ఇన్‌స్టెంట్‌ డిస్కౌంట్‌ ఇస్తున్నారు.

➤ బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ వారు భారత దేశపు అతి పెద్ద పండుగ ఆఫర్‌ సదుపాయం కల్పిస్తున్నారు. రూ. 1కోటి నగదు బహుమతులను ప్రకటించారు. రూ.20, 30, 50 లక్షల విలువ చేసే బహుమతులతో పాటు 15 శాతం వరకు క్యాష్‌ బ్యాక్‌ ఆఫర్లు ఉన్నాయి.

➤ బిగ్‌సి వారు దసరా ధమాకా ఆఫర్స్‌ ఉన్నాయి. క్యాష్‌బ్యాక్‌, ఇన్‌స్టెంట్‌ డిస్కౌంట్‌, స్మార్ట్‌ టీవీ, స్మార్ట్‌ వాచ్‌, ఎక్ఛేంజ్‌ ఆఫర్‌లు ఇస్తున్నారు.

➤ ఖజానా జ్యువెలరీ వారు ప్రతి గ్రాము గోల్డ్‌ జ్యువెలరీపై రూ.120 తగ్గింపు, వజ్రాలు, తయారీ ఛార్జీలపై 20 శాతం వరకు తగ్గింపు, జెమ్‌ స్టోన్‌ అండ్‌ అంటిక్‌ జ్యువెలరీ ప్రతి గ్రాముకు రూ.280 వరకు తగ్గింపు, వెండి వస్తువులు మజూరీ ఛార్జీలపై 25 శాతం వరకు తగ్గింపు ఆఫర్లను ప్రకటించారు.

➤ తనిష్క్‌ జ్యువెలరీ వారు స్వర్ణాభరణాల మజూరీ, వజ్రాల ఆభరణాల విలువలపై 20 శాతం వరకు తగ్గింపు, పాత బంగారంపై వంద శాతం మారకపు విలువ, ఇతర జ్యువెలరీ నుంచి కొనుగోలు చేసిన బంగారానికి కూడా దీనిని వర్తింపజేస్తున్నారు.

➤ హీరో షోరూమ్‌ వారు ద్విచక్ర వాహనాలపై గ్రాండ్‌ ఇండియన్‌ ఫెస్టివల్‌ ఆఫ్‌ ట్రస్ట్‌ ప్రకటించారు. 6.99 శాతం అతి తక్కువ వడ్డీ రేటు, రూ.2,100 క్యాష్‌ డిస్కౌంట్‌, రూ.3 వేల వరకు ఎక్స్ఛేంజ్‌ ఆఫర్లను అందిస్తున్నారు.

➤ టీబీజెడ్‌ షోరూమ్‌ వారు బంగారు ఆభరణాల మజూరీపై ఫ్లాట్‌ 50 శాతం తగ్గించి ఇస్తున్నారు. డైమండ్‌ ఆభరణాల మజూరీపై చార్జీలు లేకుండా, అలాగే జెడావ్‌ ఆభరణాలపై 25 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారు.

➤ డ్రెస్‌ సర్కిల్‌ షాపింగ్‌ వారు దసరా సంబరాలు ప్రకటించారు. ప్రతి వెయ్యి రూపాయల కొనుగోలుపై ప్రతి ఆదివారం జరిగే బంపర్‌ డ్రాలో దుబాయ్‌ ట్రిప్‌ గెలుపొందే అవకాశం ఒకరికి కల్పిస్తున్నారు. ప్రతిరోజూ లక్కీ డ్రాలో విలువైన బహుమతులు ఒకరికి అందిస్తున్నారు.

➤ విశాల్‌ మెగా మార్ట్‌ వారు లేటెస్ట్‌ దసరా ఫ్యాషన్‌ ఆఫర్లు ఇస్తున్నారు. ప్రతి వస్తువుపై డిస్కౌంట్‌ ఇస్తున్నారు. వీటితో పాటు జార్‌ మిక్సర్‌ గ్రైండర్‌, డబల్‌ బెడ్‌ కంఫర్టర్‌, గిఫ్ట్‌ వోచర్లు ఇస్తున్నారు.

➤ టీవీఎస్‌ ఎక్సెల్‌ 100 రూ.2,100 క్యాష్‌ డిస్కౌంట్‌తో వాహనాలను విక్రయిస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ పరిధిలో ఆగస్టులో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. ఈ పరీక్షలు 12,171 మంది విద్యార్థులు రాయగా 5,030 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫలితాల కోసం https://rayalaseemauniversity.ac.in లో చూడాలని విద్యార్థులకు సూచించారు.

ఆసుపత్రిలో తాగునీటి కొరత తీర్చాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చికిత్స కోసం వచ్చిన రోగులకు తాగునీటి కొరత తీర్చాలని ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి సీపీఎం ఓల్డ్‌సిటీ కమిటీ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు మైమూద్, డి.కుమార్ ఉన్నారు.

కల్లూరు సొసైటీ అభివృద్ధికి మరింత కృషి

కర్నూలు(అగ్రికల్చర్): కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని మరింత అభివృద్ధిలోకి తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ శివశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పీఏసీఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు సుబ్బారెడ్డి, బాలవర్ధిరాజుతో కలిసి మాట్లాడారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీసుకున్న చొరవ వల్ల కాంపౌండ్ వాల్ సాకారం అయిందని తెలిపారు. ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్‌పర్సన్ సహకారంతో సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఖాళీ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టి సొసైటీకి ఆదాయాన్ని మరింత పెంచుతామని తెలిపారు.

ఓటీఎస్ లబ్ధిదారులకు వరం

కల్లూరు: ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటీఎస్ విధానం గృహ రుణాలు తీసుకున్న లబ్ధిదారులకు వరమని కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 74వ వార్డు సచివాలయంలో గృహ నిర్మాణశాఖలో ఇంటి పత్రాలు తనఖా పెట్టిన లబ్ధిదారులకు కార్పొరేటర్ ఓటీఎస్ ద్వారా వాటిని పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ 1983 నుంచి 2011 వరకు గృహ నిర్మాణ సంస్థ వద్ద స్థలాలను తనఖా పెట్టి, ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు తీసుకున్న లబ్ధిదారులు ఈ పథకం కింద నామమాత్రపు ఫీజు చెల్లించి యజమాన్య హక్కులు పొందాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు స్పందన కరువు



సమస్యలు వింటున్న చెర్ పర్సన్, సభ్యులు

కర్నూలు (రాజ్‌విహార్) : వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన కరువైంది. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి (రిటైర్డ్ జడ్జి), సభ్యులు కె.రామమోహన్ రావు, జి.ఈశ్వరమ్మ హాజరై అర్జీలు తీసుకున్నారు. అయితే, ఈ అదాలత్‌కు 9 మంది మాత్రమే హాజరయ్యారు. కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ప్రతి వారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించి 95 శాతం సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సాధారణ రోజుల్లో నేరుగా ఆయనకు ఫోన్ చేసిన వెంటనే స్పందించి, సంబంధిత అధికారులను లైన్‌లోకి తీసుకొని పరిష్కరిస్తున్నారు. దీంతో విద్యుత్ అదాలత్‌కు అధిక సంఖ్యలో అర్జీలు రాలేదు. కార్యక్రమంలో ఎస్ఏఈ చిన్న రాఘవులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఏఓగా వెంకటరంగారెడ్డి

కర్నూలు (అగ్రికల్చర్) : జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో సాంకేతిక వ్యవసాయ అధికారిగా (టెక్నికల్ ఏఓ)గా వెంకటరంగారెడ్డి నియమితులయ్యారు. ఆయన ఇంతవరకు నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా విధులు నిర్వహించారు. డిప్యూటేషన్‌పై కర్నూలు వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి.ఎల్.వరలక్ష్మిని కలిసి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

శాంతి మార్గంలో నడవాలి

కర్నూలు(రాజ్‌విహార్): సర్వ మానవాళి శాంతి మార్గంలో నడవాలని ఇస్లాం ధర్మం సూచిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఇస్లామియా అరబిక్ కళాశాల ఆవరణలో ముస్లింల ఆధ్యాత్మిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతితో పాటు ఎదుటి వారి పట్ల సమన్వయంతో ఉండాలన్నది ఇస్లాం ధర్మాల్లో ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హజరత్ మౌలానా జమాల్ రహమాన్ సాహెబ్, నిర్వాహకులు షావలి, జాకీర్ పాల్గొన్నారు.



బుధవార పేటలో దుర్గాదేవిగా అమ్మవారు



ఇతాంద్రపాడు గ్రామంలో...



గీతామందిరంలో ...



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో ..



సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో దుర్గాదేవిగా..

మమ్మేలమ్మా.. దుర్గమ్మా

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని దుర్గమ్మగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గీతా మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకీ సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. –కర్నూలు కల్చరల్



బుధవార పేటలో దుర్గమ్మ విగ్రహం వద్ద హారతి ఇస్తున్న మహిళలు

పోలీసు అమరుల త్యాగం వెలకట్టలేనిది

కర్నూలు : శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అమరుల త్యాగం వెలకట్టలేనిదని కర్నూలు మేయర్ బీవై రామయ్య అన్నారు. ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరుల స్మృతి వనం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. పటాలం అదనపు కమాండెంట్ రవికిరణ్ బొకే అందజేయగా పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన అమరుల స్థూపం ముందు నివాళులర్పించారు. పటాలంలో విధులు నిర్వహిస్తూ అమరులైన కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా రామయ్య చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. బెటాలియన్ అభివృద్ధి కోసం రూ.40 లక్షలు ప్రభుత్వం నిధులు కేటాయించిందని, త్వరలో బెటాలియన్‌లో రోడ్ల నిర్మాణం చేపడతామని రామయ్య తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు మహబూబ్ బాషా, శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.



అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న బీవై రామయ్య

అయోడిన్ లోపిస్తే ఆరోగ్య సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే పలు ఆరోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు ఎదురవుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రపంచ అయోడిన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు గర్భిణిల్లో పిండం మామూలుగా ఎదిగేందుకు సహాయపడుతుందన్నారు. చిన్నపిల్లల్లో సరైన శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన ఒక ముఖ్య పోషక పదార్థమని తెలిపారు. అయోడిన్ లోపంతో జన్మించిన పిల్లలు చురుకుదనం లేకపోవడం, ఎదుగుదల లోపం, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతుంటారని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆహారంలో అయోడిన్ ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి హేమలత, డీఐఓడాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంయూ డాక్టర్ ఉమా, డెమో ప్రమీలమ్మ, డీపీవో విజయరాజు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య

జగనన్న ఆరోగ్య సురక్షతో ఉపయోగం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో ఉపయోగమని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శనివారం ఆయన స్థానిక కొత్తపేటలోని యూపీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడికి వచ్చి రోగులందరికీ వైద్యసేవలు అందుతున్నాయా లేదా అని పరిశీలించారు. వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ఆశ, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి గృహాల్లో ఉన్న వ్యాధిగ్రస్తులను వైద్యశిబిరానికి పంపించాలని, వారికి దగ్గర ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పరిశుభ్రత పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.



వైద్యశిబిరానికి వచ్చిన వృద్ధురాలికి మందుల కిట్ అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

8న విద్యా సంస్థల బంద్

కర్నూలు(సెంట్రల్) : కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం నవంబర్ 8వ తేదీన విద్యా సంస్థల బంద్‌ను పాటిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు ప్రకటించాయి. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, డీవైఎఫ్,ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ తదితర సంఘాల నాయకులు హాజరై విశాఖ, కడప ఉక్కు ఫ్యాక్టరీల సాధన కోసం కార్యచరణను ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీరాములు, ఐసా రాష్ట్రకార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకులు నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఎల్లప్పకు నివాళి

కర్నూలు(సెంట్రల్): వీకర్ సెక్షన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సీపీఎం పార్టీ నాయకుడు ఎల్లప్ప నిరంతరం పోరాటాలు చేశారని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు అన్నారు. శనివారం కాలనీలో ఎల్లప్ప సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, నాయకులు ఎస్.శ్యామలమ్మ, సీహెచ్ సాయిబాబా, కె.ప్రభాకర్, సుధాకరప్ప, ఏసు, జమ్మన్న, భాస్కర్ పాల్గొన్నారు.

హోంగార్డ్‌కు సత్కారం

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయస్థానం దగ్గర 12 సంవత్సరాలుగా హోంగార్డు సుభాన్ సమర్థవంతంగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ చేశారు. సుభాన్ సేవలను గుర్తు చేసుకుంటూ న్యాయవాదులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్దెల శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ప్రకాష్‌రెడ్డి, జి.స్వాములు, డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మద్దిలేటి స్వామి, న్యాయవాదులు చల్లా సుధాకర్‌రెడ్డి, సి.ప్రభాకర్‌రెడ్డి, భూజల రవీంద్రారెడ్డి, కాటం రంగడు, డి.కుమారస్వామి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

కర్నూలు(సెంట్రల్): తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా వాడడానికి వీల్లేదని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. శనివారం వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకముందు వినాయక్‌ఘాట్ నుంచి ఆయా సంఘాల నాయకులు ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కగ్గోలు హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడాకారులకు అభినందన

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 11 వ తేదీన నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో ఇరువురు క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. 63 కేజీల విభాగంలో శివశంకర్‌రెడ్డి, 55 కేజీల విభాగంలో విశ్వాసరావు బంగారు పతకాలు సాధించారు. వీరిరువురిని శనివారం స్థానిక మౌర్య ఇన్‌లోని తన చాంబర్‌లో టీజీ భరత్ అభినందించారు.

విద్యుత్ సమాచారం

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

కర్నూలు (రాజ్‌విహార్) : నగరంల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు టౌన్ ఏడీఈ-1 రాజమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రభుత్వ ఆసుపత్రి, వ్యాక్సిన్ సెంటర్, డీఎంహెచ్ఓ ఆఫీస్, మహిళా ప్రాంగణం, ఇతర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి సీఎం కృషి

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, అయితే ఆర్థిక శాఖలోని కొందరు అధికారుల కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 2022 జనవరి 1 డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇందుకు కొందరు ఆర్థిక శాఖ అధికారులే కారణమని పేర్కొన్నారు. స్టేట్ ఆడిట్ డైరెక్టర్ అడ్డగోలుగా బదిలీలు చేస్తుండటంతో ఆ విభాగం కింది స్థాయి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయనను వెంటనే డైరెక్టర్ పోస్టు నుంచి తప్పించాలని సూచించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం గజెట్ విడుదల చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా నాయకుడు కేసీహెచ్ కృష్ణుడు, ఇతర నాయకులు కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి

రంగస్థల కళాకారిణులకు చీరల పంపిణీ

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని సుప్రసిద్ధ రంగస్థల మహిళా కళాకారిణులకు చీరలు పంపిణీ చేశారు. మద్దురునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య, చీరల పంపిణీ ప్రదాత బైలుప్పల షఫీయుల్లా, తెలుగు భాష ఉద్యమ నాయకులు జేఎస్ఆర్‌కే శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కళా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న పత్తి ఓబులయ్యకు, పి.హనుమంతరావు చౌదరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గజల్ గాయకులు మహమ్మద్ మియా, డాక్టర్ ఎస్.జి.ఎస్.సుభాన్, సయ్యద్ రోషన్ అలీ, సీబీ అజయ్‌కుమార్, పి.దస్తగిరి, మంజుల, రామకృష్ణ, టి.రాజశేఖర్, డి.పుల్లయ్య, డిఎస్‌వి సుబ్బయ్య, ఎం.మనోహర్ బాబు, డి.పుల్లయ్య, డి.పార్వతి, గాండ్ల లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

నాపరాయి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : ఓర్వకల్లు, నన్నూరు టోల్ ప్లాజా, గూడూరు మండలం కె.నాగలాపురం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న నాపరాయి లారీలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి మైనింగ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా నాపరాయి తరలిస్తున్న రెండు లారీలను ఓర్వకల్లు, నన్నూరు టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్‌లో, కె.నాగలాపురం దగ్గర సీజ్ చేసిన మరో లారీని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు వెల్లడించారు. వాహన యజమానులకు జరిమానా విధించనున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మురహరి, నవీన్ కుమార్ ఉన్నారు.

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు వివిధ అంశాలపై విజ్ఞానాన్ని పెంపొందించాలని, ఇందుకు విజ్ఞాన శిబిరాలు ఉపయుక్తంగా నిలుస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క అన్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని ఈనెల 14వ తేదీన ప్రారంభమైన విజ్ఞాన శిబిరం శనివారం ముగిసిది. శిబిరంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడంతో పాటు ఆధ్యాత్మిక పుస్తకాలు గురించి తెలియజేశారు. చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో పెద్దక్క మాట్లాడుతూ విజ్ఞాన శిబిరానికి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకున్నారన్నారు. శ్రీ రామకృష్ణ సేవా సంఘ అధ్యక్షుడు విశ్రాంత అధ్యాపకులు హుసేన్‌పీర మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు విషయ అవగాహన కలగడంతో పాటు సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి, లైబ్రేరియన్ బాషా, నసీమాబీ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

బాధితులకు బాసటగా...

- ఎమ్మిగనూరులో సీఎంను కలిసిన వారికి ఆర్థిక సాయం అందజేత
- ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున చెక్కులు

కర్నూలు(సెంట్రల్): అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సాయం కోసం వచ్చిన బాధితులకు సీఎం వైఎస్ జగన్ బాసటగా నిలిచారు. ఈనెల 19న ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంను హెలిప్యాడ్‌లో పలువురు బాధితులు వైద్య సహాయం, ఆర్థిక చేయాలని విన్నవించారు. వారి కష్టాలను చూసి చలించిన ఆయన తక్షణమే ఆదుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా కలెక్టర్ మొత్తం 12మందికి ఆర్థిక సాయం అందించారు. ఇందులో 11మందికి లక్ష చొప్పున ఇవ్వగా, ఒక్కరికి రూ.50 వేల చెక్కు అందజేశారు. 12మందిలో శుక్రవారం ఆరుగురికి, శనివారం మరో ఆరుగురికి కలెక్టర్ తన చాంబరులో చెక్కులను అందజేసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూధనరావు పాల్గొన్నారు.





విన్నవించగానే సాయం



కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న గురుబ్రహ్మ నగర్‌కు చెందిన లక్ష్మీదేవి(55) తన భర్త, పెద్ద కుమారుడు చనిపోయారని, ఉన్న చిన్న కుమారుడు ఎం. యుగంధర్ అంగవైకల్యంలో బాధపడుతున్నారని, తాను వయోభారంతో ఏ పనిచేయలేని స్థితిలో ఉన్నానని, ఆర్థిక సాయం చేయాలని సీఎం వైఎస్ జగన్‌ను అభ్యర్థించారు. వారికి కలెక్టర్ తక్షణ సాయంగా రూ. లక్ష అందజేశారు.

కష్టకాలంలో ఆర్థిక భరోసా



నంద్యాల జిల్లా గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన జీహెచ్ మద్దిలేటి 2008లో రోడ్డుప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో సంభవించిన ఫ్రాక్చర్ తదనంతరం బోన్‌క్యాన్సర్‌గా మారడంతో ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్నారు. అయితే ఎలాంటి పనిచేయడానికి శరీరం సహకరించకపోవడంతో సీఎంను ఆర్థిక సాయం కోసం అభ్యర్థించగా కలెక్టర్ ఆయనకు రూ.50 వేల చెక్కు అందజేశారు. కష్టకాలంలో ఈ సాయం అందిందని మద్దిలేటి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



సీఎంకు కృతజ్ఞతలు



తన భర్త చనిపోయారని, ఎవరూ దిక్కు లేకపోవడంతో కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నానని, తనకు విడో పెన్షన్‌ను మంజూరు చేయాలని, ఆర్థిక సాయం చేయాలని కోడుమూరుకు చెందిన భాగ్యమ్మకు సీఎంకు విన్నవించుకోగా ఆమెకు కలెక్టర్ తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా భాగ్యమ్మ చెప్పారు.

‘ఐదు’ ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్షప్రసారం




కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ఢమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కురదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులోక్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.


క్లాసెన్


బట్లర్


జాన్సెన్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్‌లో పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగుకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్క్‌రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్-లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. వికెట్ల పతనం: 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. వికెట్ల పతనం: 1-4, 2-125, 3-164, 4-233, 5-243, 6-394, 7-398. బౌలింగ్: టాప్లీ 8.5-0-88-3, విల్లీ 9-1-61-0, రూట్ 6.1-0-48-0, అట్కిన్సన్ 9-0-60-2, వుడ్ 7-0-76-0, ఆదిల్ రషీద్ 10-0-61-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం: 1-18, 2-23, 3-24, 4-38, 5-67, 6-68, 7-84, 8-100, 9-170. బౌలింగ్: ఇన్‌గిడి 5-1-26-2, జాన్సెన్ 5-0-35-2, రబడ 6-1-38-1, కోయెట్జీ 4-0-35-3, కేశవ్ 2-0-27-1.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.



స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం: 1-7, 2-28, 3-54, 4-68, 5-71, 6-91, 7-221, 8-244, 9-252, 10-262. బౌలింగ్: మదుషంక 9.4-1-49-4, రజిత 9-0-50-4, కరుణరత్నే 9-1-58-0, తీక్షణ 10-0-44-1, హేమంత 8-0-42-0, ధనంజయ 4-0-13-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. వికెట్ల పతనం: 1-18, 2-52, 3-104, 4-181, 5-257. బౌలింగ్: ఆర్యన్ దత్ 10-0-44-3, వాన్ బీక్ 10-0-57-0, మీకెరెన్ 8-1-39-1, డి లీడ్ 3-0-29-0, వాన్‌డర్ మెర్వ్ 9-0-42-0, అకెర్‌మన్ 8.2-0-39-1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

నేటి నుంచి పారా ఆసియా క్రీడలు

- వారం పాటు ఈవెంట్
- 313 మందితో భారత బృందం



హాంగ్జౌ: ఇటీవల ఇక్కడే జరిగే ఆసియా క్రీడల్లో ముందెన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత బృందంలాగే పారా అథ్లెట్లు కూడా గంపెడాశలతో పారా ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ పోటీల్లో భారత దివ్యాంగ అథ్లెట్లు సత్తాచాటాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన అవని లేఖరా, సుమిత్ అంటిల్‌లు భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. టోక్యోలో 2021లో జరిగిన మెగా ఈవెంట్‌లో స్టార్ షూటర్ అవని బంగారంతో పాటు కాంస్యం గెలిచింది. జావెలిన్ త్రోయర్ అంటిల్ కూడా పసిడి పట్టాడు. వీరితో పాటు పతకం ఆశలున్న పారా షూటర్ మనీశ్ నర్వాల్, షట్లర్లు ప్రమోద్ భగత్, కృష్ణ నగర్‌లు సహా మొత్తం 313 మందితో కూడా భారత పారా అథ్లెట్ల బృందం హాంగ్జౌలో పతకాల వేట మొదలుపెట్టేందుకు సై అంటోంది. మొత్తం 22 క్రీడాంశాలు నిర్వహిస్తుండగా భారత అథ్లెట్లు 17 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సరిగ్గా వారం రోజుల పాటు జరిగే ఈ పారా మెగా ఈవెంట్‌లో 43 దేశాలకు చెందిన సుమారు 4000 మంది అథ్లెట్లు పోటీపడనున్నారు. 22 క్రీడాంశాల్లో 566 గోల్డ్ మెడల్ ఈవెంట్లున్నాయి. తొలిసారిగా 2010లో గ్వాంగ్‌జౌలో పారా ఆసియా క్రీడలు జరిగాయి. ఇందులో భారత బృందం 14 పతకాలు సాధించి 15వ స్థానంలో నిలిచింది. 2018లో జరిగిన గత పారా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు మొత్తం 72 పతకాలు సాధించి టాప్-10లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఈ సారి పతకాల సెంచరీ మార్కు దాటించేందుకు భారత అథ్లెట్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షూటింగ్‌లో క్రితం సారి మూడు పతకాలే వచ్చాయి. అయితే అవని జకార్తా (2018) ఈవెంట్‌లో ఆడలేదు. ఇప్పుడు స్టార్ షూటర్ అందుబాటులో ఉండటంతో షూటింగ్ లోనూ పతకాల సంఖ్య ఆశించినంత పెరగొచ్చు.

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం



ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5-11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21-18, 19-21, 21-7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11-10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18-18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11-3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20-16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20-19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3-0, ఆపై 3-2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14-2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.

మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...‘ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా’ అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ ‘ఎల్లో కార్డు’లు కూడా చూపించాల్సి వచ్చింది.

సరదా.. దసరా..


● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ


● కాజోల్


● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సినిమా

సరిపోదా శనివారం?


● నాని

‘అంటే సుందరానికీ’ చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి ‘సరిపోదా శనివారం’ అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా!

- హీరో కార్తికేయ


● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

‘‘ఆర్‌ఎక్స్ 100’ తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో ‘మంగళవారం’ సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో ‘ఆర్‌ఎక్స్ 100’ తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా ‘మంగళవారం’లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను’’ అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమిర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం ‘మంగళవారం’. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ- ‘‘మంగళవారం’ మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది’’ అన్నారు. ‘‘మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల ‘మంగళవారం’తో నెరవేరింది’’ అన్నారు స్వాతీ రెడ్డి. ‘‘ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది’’ అన్నారు సురేష్ వర్మ. ‘‘నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో ‘మంగళవారం’కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు’’ అన్నారు పాయల్.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు

- దర్శకురాలు పూజ



సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘మార్టిన్ లూథర్ కింగ్’. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ- ‘‘సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో ‘మార్టిన్ లూథర్ కింగ్’ నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక ‘మార్టిన్ లూథర్ కింగ్’ విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం ‘మండేలా’ కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ- ‘‘ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఓకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్య ఉన్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది’’ అని చెప్పుకొచ్చారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● పూజిత, విరాజ్

‘బేబి’ సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం ‘జోరుగా హుషారుగా’. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ- ‘‘యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘జోరుగా హుషారుగా’. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది’’అన్నారు.